క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల వివరాలు నమోదు

జైనథ్: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో టీపీసైట్‌లో మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలను నమోదు చేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి సంబంధించిన 36 పోలింగ్ కేంద్రాలతో పాటు మండలంలోని 20,024 ఓటర్ల పేర్లు నమోదు చేశారు.

మోడల్‌స్కూల్‌కు విద్యార్థులు ఎంపిక

బోథ్: మండలంలోని ధన్నూర్ బి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఇటీవల విడుదలైన మోడల్ స్కూల్ ప్రవేశ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు రావుల శంకర్ తెలిపారు. కె.విష్ణు విరాట్, తొర్తి భార్గవి, సంగెపు లక్ష్మి, రాథోడ్ స్వప్న, ఆడె సుచిత్రలు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

కురుమ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

బోథ్: సొనాల గ్రామ కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కసిరెె చిన్న పోతన్న, ఉపాధ్యక్షుడిగా బాలె దేవన్న, ప్రధాన కార్యదర్శిగా రామాయి శంకర్, కోశాధికారులుగా దేవన్న, దేవేందర్, కార్యదర్శిగా ఊరె సంతోష్, రామాయి సదానందంలను ఎన్నుకున్నారు. ఎన్నికల సలహాదారులుగా కటకం చంద్రకాంత్ బాబు వ్యవహరించారు.

ఘనంగా రాణి అహల్యబాయి హోల్కర్ జయంతి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: రాణి అహల్యబాయి హోల్కర్ 300వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండలంలోని దనోరా(బి) గ్రామంలో యువజన సంఘ ఆధ్వర్యంలో రాణి అహల్యబాయ్ హోల్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు ఆరెల్లి రాజలింగు, దీపక్‌సింగ్, కనక హనుమంత్‌రావ్, దిలీప్ మోరే, కోవ రాజేశ్వర్, రాథోడ్ భీంరావ్, దనోరా(బి) యువజన సంఘం నాయకులు మెస్రం సందీప్, బ్రహ్మానంద్, శ్రీహరి, అమూల్ పాటిల్, సంతోష్, రాజేశ్, జైదీప్ తదితరులు ఉన్నారు.

వేలాడుతున్న 'విద్యుత్ ప్రమాదం'



రేకులపై ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఇండియన్ దాబా పైకప్పు రేకులపై విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతుండడంతో ప్రమాదం పొంచి ఉందని హోటల్ నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. వేలాడుతున్న విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేపట్టాలని విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయాలని కోరుతున్నారు.

'జొన్న కొనుగోళ్ల గడువు పెంచాలి'

నార్నూర్: ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న జొన్న కొనుగోలు గడువును మరో పది రోజులు పెంచాలని మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తొడసం నాగోరావు అధికారులను కోరారు. శనివారం మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 31తో జొన్న కొనుగోలు గడువు ముగియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చాలా మంది రైతులు జొన్న పంట తీయలేకపోయారన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని మరో పది రోజులు జొన్న కొనుగోలు గడువు పెంచాలని కోరారు.

'అందుబాటులో పత్తి విత్తనాలు'

కైలాస్‌నగర్: జిల్లాలోని 350 విత్తన దుకాణాలలో వివిధ కంపెనీలకు చెందిన 13,64,978 పత్తి విత్తన సంచులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ సమీపంలోని డీలర్ వద్ద విత్తన కొనుగోలు సమయంలో విధిగా రశీదు పొందాలని సూచించారు. రశీదు, విత్తన సంచిని పంటకాలం పూర్తయ్యేవరకు భద్రపర్చుకోవాలని సూచించారు.

బతుకులు మారేదెన్నడో..!



పొంగిపొర్లుతున్న లక్ష్మెట్టిపేట వాగు (ఫైల్)

- వంతెనలు లేక తిప్పలు
- వాగులు ఉప్పొంగితే రాకపోకలు బంద్
- సమీపిస్తున్న వర్షాకాలం
- ఆందోళనలో ఏజెన్సీ ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: వర్షాకాలం సమీపిస్తుందంటే ఏజెన్సీ మారుమూల గ్రామాల ఆదివాసీల్లో అలజడి మొదలవుతుంది. వర్షాలు పడితే గ్రామ సమీపాల్లోని వాగులు, వంకలు పొంగిపోర్లి బాహ్య ప్రపంచంతో ఆయా గ్రామాల సంబంధాలు తెగిపోతున్నాయి. ఎండాకాలంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, వంతెనలు నిర్మించాలని ఏటా కోరుతున్నా పట్టించుకోవడం లేదని, ఇంకెన్నాళ్లు అవస్థలంటూ ఆదివాసీలు వాపోతున్నారు.

వసతులు కరువు..

గిరిజన గ్రామాల అభివృద్ధికి ఇటు ఐటీడీఏ, అటు



వంకతుమ్మ వాగు దాటుతున్న గ్రామస్తులు (ఫైల్)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తున్నా కనీసం వాగులపై వంతెనలు వేయలేకపోతున్నాయి. గిరిజన గ్రామాల ప్రజలు రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రసూతులు, ప్రమాదాలు, వ్యాధులు సంభవించినప్పుడు ఆసుపత్రికి తరలించే తరుణంలో సరైన సమయానికి వైద్యం అందని దుస్థితి నెలకొంది.

అధికారులు చొరవ తీసుకోవాలి



నేటికీ ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన ప్రాంతాల కుటుంబాలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. రవాణా వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఆదివాసీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు, అధికారులు స్పందించి మంజూరైన వంతెనల నిర్మాణాలు వెంటనే చేపట్టాలి.

– ఆత్రం భుజంగ్‌రావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

గిరిజనుల్లో గుబులు..

వర్షాకాలం వచ్చిందంటే మారుమూల గిరిజన ప్రాంతాల ఆదివాసీల్లో గుబులు పుడుతుంది. మారుమూల గ్రామాల నుంచి మండలం, జిల్లా కేంద్రాలకు చేరుకోవాలంటే వాగులు, వంకలు ఉండడం, వాటిపై వంతెనలు లేక పడరాని పాట్లు పడుతున్నారు. ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్-జే, వంకతుమ్మ, ముసల్‌పాడ్, లేండిగూడ, రాజులగూడ, కెస్లాగూడ, ఉమాపతికుంట తదితర గ్రామాల ప్రజలు వంతెన, రోడ్డు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అడవిని నమ్ముకొని జీవిస్తున్న గిరిజనులు ప్రసవాలు, ఏదైన ప్రమాదం సంభవించినప్పుడు ఆసుపత్రులకు చేరుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్లు, వంతెనలు మంజూరైనా అటవీ శాఖ అధికారుల అనుమతులు లేక పనులు ముందుకు సాగడం లేదని ఆదివాసీలు పేర్కొంటున్నారు.

దొంగలతో జాగ్రత్త..!



ఉట్నూర్ సంతలో ప్రజలు (ఫైల్)

- ఆదివారం సంతలో దొంగతనాలు
- సెల్‌ఫోన్లే టార్గెట్
- లబోదిబోమంటున్న స్థానికులు

ఉట్నూర్‌రూరల్: ఆదివారం వచ్చిందంటే ఉట్నూర్ అంగడిబజార్ జనంతో సందడిగా మారుతోంది. ఉట్నూర్ పట్టణవాసులే కాకుండా చుట్టుపక్కల, ఆయా మండలాల వ్యాపారస్తులు, గ్రామాల వాసులు సంతకు వస్తుంటారు. వారానికి సరిపడా సరుకులు, కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. ఆదివారం ఉట్నూర్ పెద్ద సంత కావడంతో ఆదిలాబాద్, ఇంద్రవెల్లి, జన్నారం, గుడిహత్నూర్ తదితర మండలాల నుంచి కూడా వ్యాపారస్తులు వచ్చి పండ్లు, కూరగాయలు, తదితర వస్తువులు విక్రయిస్తూ వ్యాపారం చేస్తుంటారు. ఏళ్లుగా ఈ సంత పెద్దఎత్తున కొనసాగుతోంది.

సంతలో దొంగతనాలు..

ఇటీవల సంతలో తరుచూ దొంగతనాలు జరుగుతున్నాయి. పెద్ద ఎత్తున జనం గుమిగూడి ఉండడంతో దొంగల పని తేలికంగా మారుతోంది. ఇటీవల ఓ ప్రభుత్వ ఉద్యోగి సంతకు వచ్చి కూరగాయలు తీసుకొని ఇంటి వెళ్దామనుకున్న తరుణంలో జేబులో ఫోన్ లేక ఒక్కసారిగా కంగుతిన్నాడు. దొంగతనంపై వెంటనే పోలీసులకు సైతం సమాచారం అందించాడు. తనకు తెలియకుండానే జేబులోని ఫోన్ ఎవరో కొట్టేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరాడు. కాగా ప్రతీ ఆదివారం మండలంలో పెద్ద ఎత్తున సంత కొనసాగుతోంది. ఇదే అదునుగా భావిస్తున్న దొంగలు సంతలో దొంగతనాలు చేస్తున్నారు. వందల మందిలో సంతకు వచ్చే వారు దొంగతనాలను పసికట్టలేక పోతున్నారు. తీరా ఇంటికి వెళ్లి, మార్కెట్ బయటికి వచ్చి చూడగా సెల్‌ఫోన్, డబ్బులు ఏదో ఒకటి పోయి లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు సంతపై ప్రత్యేక దృష్టి సారించి దొంగల బెడద నుంచి ప్రజల వస్తువులకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

'బ్యాంకు మేనేజర్‌ను బదిలీ చేయండి'



బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో గల తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్రాంచి మేనేజర్ రైతులు, ఖాతాదారులపై దురుసుగా, అమర్యాదగా మాట్లాడుతున్నాడని వెంటనే బదిలీ చేయాలని శనివారం దేగామ తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట రైతులు నిరసన తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, బొడ్డు భోజన్న, పాశపు గణపతి, మడిగే రమణ, సాయిరాం రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు



పనులు పరిశీలిస్తున్న మహేశ్‌కుమార్

బేల: రానున్న వర్షాకాలం దృష్ట్యా పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం చేయొద్దని మండల పంచాయతీ అధికారి మహేశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా, ఇందిరానగర్ కాలనీ ల్లో కొనసాగుతున్న మురికి కాలువల పూడికతీత పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మురికి కాలువల పూడికతీతను అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, కారోబారి కళ్యాణ్‌కార్ గజానన్ ఉన్నారు.

జొన్నల డబ్బులు విడుదల చేయాలని ధర్నా

తాంసి: జొన్నలు కొనుగోలు చేసిన డబ్బులు విడుదల చేయాలంటూ పార్టీ ఆధ్వర్యంలో సుంకిడిలో ధర్నా నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో మండల పార్టీ నాయకులతో కలిసి ధర్నాకు సంబంధించిన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన జొన్నపంట డబ్బులను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేస్తూ తలమడుగు మండలంలోని సుంకిడి అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొనాలని కోరారు. నాయకులు కృష్ణ, వినోద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ఇచ్చోడ: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. కిష్టన్న, వి.అశోక్‌లు కోరారు. జిల్లాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు చేపట్టిన విద్యార్థుల నమోదు ప్రచార జాత కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సదుపాయాలు ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఫీజుల బారం నుంచి ఊరట పొందాలని సూచించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఈ.శివన్న, ఎం.శ్యాంసుందర్, సోషల్ మీడియా కన్వీనర్ శంకర్, మండలాల బాధ్యులు అశోక్, జ్ఞానోబా లక్ష్మణ్, రాజేందర్, గణేశ్, మహేందర్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి

ఇంద్రవెల్లి: తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిష్టన్న, ప్రధాన కార్యదర్శి అశోక్‌లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుటకు టీఎస్ యూటీఎఫ్ చేపట్టిన ఎన్రోల్మెంట్ ప్రచారజాతలో భాగంగా శనివారం మండలకేంద్రంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కార్యదర్శులు శివన్న, శ్యాంసుందర్, శ్రీనివాస్, శంకర్, గణేశ్, మహేందర్, అశోక్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకుడు అశోక్

ఉత్తర్వులను పునః సమీక్షించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్ణయాన్ని ప్రభుత్వం పునః సమీక్షించుకోవాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చవాన్ కోరారు. లోకమాత అహల్యాబాయి హోల్కర్ జయంతిని శనివారం పట్టణంలోని మాధవ నిలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట ప్రాథమిక పాఠశాలల్లో టీచర్లు లేకుండా చేయడం దారుణమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే ప్రాథమిక పాఠశాలలో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని కోరారు. ధర్మ స్థాపనకు దేశం మొత్తం తిరిగి, స్త్రీ స్వేచ్ఛ కోసం ఎంతో కృషిచేసిన అహల్యాబాయి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. తపస్ ప్రధాన కార్యదర్శి వలభోజు గోపీకృష్ణ, మహిళా అధ్యక్షురాలు కుర్సెంగ జీజాబాయి, నాయకులు గంగాధర్, రాజ్‌కుమార్, కృష్ణసాగర్, ఆత్రం సతీశ్, రాజేశ్వర్, శ్రీనివాస్, గంభీర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్ చవాన్

రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయండి

నార్నూర్: గ్రామ పంచాయతీ పరిధిలో ఈ నెల 3నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దార్ జాడి రాజలింగు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 3న బలాన్‌పూర్, మహాగావ్‌లో 4న నాగల్‌కొండ, ఖంపూర్, 5న సోనాపూర్, మాదాపూర్, 6న గుంజాల, గుండాల, 9న గంగాపూర్, బాబేఝరి, 10న మాన్కాపూర్, చోర్గావ్, 11న తాడిహత్నూర్, సుంగాపూర్, 12న ఎంపల్లి, ఖైర్‌డట్వా, 13న భీంపూర్, దుప్పాపూర్, 16న కొత్తపల్లి హెచ్, మాలేపూర్, 17న నార్నూర్, మల్లెంగి, 18న ఉమ్రీ, 19న మంజ్రీ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇంటి నిర్మాణంలో నిబంధనలు పాటించాలి



మంజూరుపత్రం అందజేస్తున్న అధికారులు



తాంసి: మంజూరు పత్రం అందజేస్తున్న ఎంపీడీవో

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేసుకోవాలని ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లాండసాంగ్వి, అర్లి (బి), చాందా (టి) గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆయన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమిపూజ చేయడంతో పాటు ఇంటి మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కోసం 606 మంది దరఖాస్తు చేసుకోగా, 468 మంది అర్హులుగా గుర్తించామన్నారు. మిగితా 138 లబ్ధిదారుల జాబితా ఎంపిక వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉందన్నారు. మంజూరు కానీ లబ్ధిదారులు ఆందోళన చెందావాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీవో స్వప్నశీల, హౌజింగ్ ఏఈ, అసిస్టెంట్ ఏఈ, ఆయా గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

జైనథ్‌లో..

జైనథ్: మండలంలో సుమారు 198 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా శనివారం ఆరు గ్రామాల్లో మంజూరైన ఇండ్లకు అధికారులు భూమిపూజ చేశారు. మండల అభివృద్ధి అధికారి రవీంద్రనాథ్ మాట్లాడుతూ కాప్రి గ్రామంలో 9 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించామన్నారు. కూర, కారింజి, మకోడా, బెల్గాం, బెల్లూరి గ్రామాల్లోని లబ్ధిదారులకు పట్టాలు అందించామన్నారు. జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, ఎంపీవో మహేశ్, ఆలయ కమిటీ చైర్మన్ లోకేష్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాంసిలో..

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. మండలంలోని గిరిగాం, అంబుగాం, లీంగూడ గ్రామాల్లో లబ్ధిదారులతో కలిసి ఎంపీడీవో మోహన్ రెడ్డి ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు పత్రాలు అందజేశారు. వారి వెంట హౌసింగ్ ఏఈ నజీర్, పంచాయతీ కార్యదర్శులు కార్తీక్, గంగన్న ఉన్నారు.

పనులు నిలిపివేసిన పంచాయతీ కార్యదర్శులు

బోథ్: గత సంవత్సరం ఆగస్ట్ నెల నుంచి నేటి వరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం, నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో బోథ్, సొనాల మండలాల పంచాయతీ కార్యదర్శులు పంచాయతీల్లో ట్రాక్టర్ ద్వారా చెత్త నిర్వహణతో పాటు, మోటార్ రిపేర్‌లు, వీధి దీపాల నిర్వహణ పనులు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం బోథ్ ఎంపీడీవో రమేశ్‌కు ఆ విషయాన్ని తెలియజేశారు. గత 18 నెలలుగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల జేఏసీ ఏర్పాటు..

మండల పంచాయతీ కార్యదర్శుల జేఏసీని శనివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా జాదవ్ అశోక్ కుమార్, ఉపాధ్యక్షులుగా మిథున్ చక్రవర్తి, లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా శిరీష, షకీల్ అహ్మద్, కోశాధికారిగా జితేందర్, సలహాదారులుగా అంజయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జీగా గంగయ్యలను ఎన్నుకున్నారు.



ఎంపీడీవోతో పంచాయతీ కార్యదర్శులు

అధ్వానంగా డ్రెయినేజీ!

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని పాత ఉట్నూర్ రామమందిరం మూల మలుపు వద్ద ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న మురికి కాలువ చెత్తాచెదారం, మురుగు నిండి అధ్వానంగా మారింది. సమస్యపై గ్రామపంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.



చెత్తాచెదారంతో మురుగు నీటి కాలువ

బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో గత మూడున్నర సంవత్సరాల పాటు ఇన్స్‌స్పెక్టర్‌గా సేవలందించి జనగామ జిల్లాకు బదిలీపై వెళ్తున్న సీహెచ్ గంగాధర్‌ను శనివారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్ రావ్, దళితాభివృద్ధి శాఖ అధికారిణి సునీత కుమారి, కార్యాలయ ఉద్యోగులు శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి మనోహర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న దళిత బంధు కార్యక్రమంలో ఎలాంటి అవకతవకలు లేకుండా విజయవంతం చేయడానికి ఆయన కృషి చేశారన్నారు. అంతేకాకుండా రాష్ట్రస్థాయిలో జిల్లాను మొదటి స్థానంలో నిలవడానికి ఆయన చేసిన కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు శంకర్, నక్క గణేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఉద్యోగిని సన్మానిస్తున్న ఉద్యోగులు

సంక్షిప్త వార్తలు

అధిక రసాయనాలు వాడొద్దు

జైనథ్: ప్రొఫెసర్ జయశంకర్ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని బెల్గాం గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త సునీల్ మాట్లాడుతూ ప్రతీ రైతు భూ పరీక్షలు చేయించుకుని నేల ఆధారిత ఎరువులు వినియోగించాలన్నారు. యూరియాను అవసరం మేరకే వాడుకోవాలని పేర్కొన్నారు. రసాయన పురుగు మందులను అధికంగా వాడొద్దని రైతులకు సూచించారు. శాస్త్రవేత్త పోశెట్టి, మండల వ్యవసాయ శాఖ అధికారి, పూజ, ఏఈవో లావణ్య, రైతులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న వారిపై కేసు

బేల: మండలంలోని కాప్సి(బి) రెవెన్యూ గ్రామ శివారులో శనివారం పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఏఎస్సై జీవన్ ఆధ్వర్యంలో సిబ్బంది సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. పేకాట ముక్కలతో పాటు రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న ఇద్దరు పట్టుబడ్డారని, మరి కొందరు పరారయ్యారని పేర్కొన్నారు.

ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: ఈ నెల 2వ తేదీన జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం కైలాస్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. నాయకులు రాజన్న, పరమేశ్వర్, అష్రఫ్, కొండ గణేశ్, వసంత్, ఉగ్గే విట్టల్, దయాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.